


(గత సంచిక తరువాయి)

"భయం వేయలేదా? నవ్వుతావే?" అడిగింది.

"మా కంపెనీ అలా జరగకుండా మాకు మేగ్జిమమ్ రక్షణని ఇస్తుంది. జరిగినా ఆ తర్వాత ఏం చేయాలో శిక్షణని ఇస్తుంది."

కొద్దిసేపాగి చైత్ర మళ్ళీ చెప్పింది.

"ఎక్కువగా ఆలోచించడంవల్ల నిరాశ కలుగుతుంది. లేని సమస్యలని మనసులో సృష్టిస్తుంది. కాబట్టి అసలు ఇబ్బంది పెట్టేవేమీ ఆలోచించను. మన దేశంలో పుట్టడం ఓ వరం అని నాకు రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో ఉన్నప్పుడు అనిపించింది. ఇండియా సేఫెస్ట్ కంట్రీ – అఫ్‌కోర్స్ పోలీసులతో, రాజకీయ నాయకులతో వివాదం లేనివారికి. లేదా ఆస్తులు, స్వేచ్ఛ, ఒకోసారి ప్రాణాలే పోతాయి."

దేశంలో, రాష్ట్రంలో ఏం జరుగుతోందో తెలీని యువతలో భాగమైన ఆద్యకి ఏమీ తెలియదు. పేపర్ చదవదు. ఇద్దరూ ఇసకలో నడిచి కెరటాల దగ్గరకి చేరుకున్నారు.

'హలో' అనే పలకరింపు విని అక్కాచెల్లెళ్ళు ఇద్దరూ అటువైపు చూసారు. ఓ నలభై ఐదేళ్ళ తెల్లజాతి యువకుడు, పక్కనే అతని భార్య, ఇద్దరు పిల్లలు.

"హలో అలెక్సీ! హౌ ఆర్ యు ఇలియా?" చైత్ర వారిని హగ్ చేసుకుంటూ పలకరించింది.

"ఫైన్. హౌ ఆర్ యు డూయింగ్?" ఇలియా ఆమె చేతిని పట్టుకుని అడిగింది.

ఇద్దరూ ఆద్యవంక చూడటంతో తన చెల్లెల్ని పరిచయం చేసింది.

"ఇతను అలెక్సీ. రష్యన్. ఆయిల్‌ని కనుక్కునే ఎక్స్‌ప్లొరేషన్ టీములో సూపర్ వైజర్. ఇటీవలే ఇక్కడో కొత్త చోట ఆయిల్‌ని కనుక్కున్నారు. అతని భార్య ఇలియా" చైత్ర పరిచయం చేసింది.

వాళ్ళిద్దరూ ఆద్యని పలకరింపుగా కౌగలించుకున్నారు.

"దీసీజ్ ఏంజెలీనా సిక్స్ అండ్ సెర్జ్ నైన్" ఆమె తన పిల్లల్ని ఆద్యకి పరిచయం చేసింది.

"హలో ఏంజెలీనా. హలో సెర్జీ" చైత్ర వాళ్ళిద్దర్నీ పలకరించింది.

పిల్లల్ని పెద్దవాళ్ళల్లా మర్యాదగా పలకరించాలని ఆద్య అర్థం చేసుకుంది.

"హౌ ఆర్ యు ఆద్య? హౌ డు యు లైక్ ఘూనా?" ఇలియా అడిగింది.

"ఐ లైకిట్. నేను ఓ రష్యన్‌ని చూడటం, మాట్లాడటం ఇదే మొదటిసారి. నిజానికి టకరోడీలో నేను కలిసిన రెండో యూరోపియన్ మీరు" ఆద్య చెప్పింది.

అలెక్సీ పెద్దగా నవ్వి చెప్పాడు.

"నిజానికి మీరు నిజమైన ఇంటర్నేషనల్ సిటిజన్‌తో మాట్లాడుతున్నారు. మా అమ్మ నన్ను పోలండ్‌లో కన్సీవ్ చేసింది. లెనిన్‌గ్రాడ్‌లో డెలివరీ చేసింది. ఫ్రాన్స్‌లో, యు.కె.లో, అమెరికాలో చదువుకున్నాను. ఎస్తోనియా అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాను. జపాన్, సౌత్ కొరియా, సౌదీ అరేబియా, నార్వే, బ్రెజిల్ క్రొయేషియాల్లో పనిచేసి ఇప్పుడు ఘూనాకి వచ్చాను. మా ఇంటికి రండి" ఆహ్వానించాడు.

"ఈ ఆదివారం" ఇలియా కూడా ఆహ్వానించింది.

"థాంక్స్. అలాగే" చైత్ర చెప్పింది.

అలెక్సీ, చైత్ర  స్క్లంబర్జే కంపెనీ షేర్ల ధర గురించి, మరికొన్ని కంపెనీల ధరల గురించి కొద్దిసేపు మాట్లాడుకున్నాక బై చెప్పారు. వాళ్ళు వెళ్ళాక చైత్ర చెల్లెలితో చెప్పింది.

"నీళ్ళల్లోకి వెళ్దాం పద. కాళ్ళకింద ఇసక కదిలి అదో తమాషా సెన్సేషన్."

ఆద్య చాలాసేపు నీళ్ళల్లో ఆడింది. చీకటిపడేదాకా సముద్ర కెరటాలని పూర్తిగా ఎంజాయ్ చేసింది.

"ఇవాళ్టినించి నీకు స్విమ్మింగ్ నేర్పుతాను. అది నేర్చుకోవడం స్పోర్ట్. ఒకోసారి ఈ స్పోర్ట్ ప్రాణాలనే రక్షించవచ్చు. ఫోటోకి మోడల్లా పోజ్ ఇవ్వు."

"మోడల్లానా? ఎలా?"

"నీ కుడికాలుని వెనకపెట్టి, దాన్ని ముని వేళ్ళమీద ఉంచు. ఇప్పుడు నడుం మీద నీ ఎడం చేతిని ఉంచి కదలక. ఇదీ మోడల్స్ పోజ్" చెప్పి ఆమె అలా నిలబడ్డాక చైత్ర క్లిక్ చేసింది.

చైత్ర ఆద్యకి తీసిన ఫోటోలు కేవలం తమ నలుగురు కుటుంబ సభ్యులకి వాట్సప్‌లో పంపింది. సముద్రంవంక చూస్తూ చెల్లెలితో చెప్పింది.

"నా కొలీగ్ పీడర్సన్ అని నార్వేజియన్. మొదటిసారి మేమిద్దరం ఇక్కడికి వచ్చినప్పుడు ప్రకృతి ముందు మనిషి ఎంతటి  అసమర్థుడో వివరించే ఓ కథ చెప్పాడు. పదకొండో శతాబ్దపు చక్రవర్తి కునూట్ శక్తిమంతుడు. అతను ఆటు వచ్చే సమయంలో సముద్రపు ఒడ్డున తన సింహాసనాన్ని వేయించుకుని  కూర్చుని గట్టిగా ఆజ్ఞాపించేవాడు. 'ఓ సముద్రమా! నువ్వు నా పౌరుడివి కావు. కాబట్టి నా భూభాగం మీదకి రావద్దని ఆజ్ఞాపిస్తున్నాను. నేను భూమికి చక్రవర్తిని. నా కాళ్ళని, బట్టలని తడపద్దు' కాని కెరటాలు వచ్చి వాటిని తడిపి వెళ్ళేవి. ప్రకృతిముందు, పరమాత్మముందు ఎంతటి చక్రవర్తైనా

బలహీనుడే అని బోధించడానికి కునూట్ ఈ పని చేసేవాడట. మనం ఎంత బలహీనులమో తెలుసుకోవడం వల్ల అహం పెరగదు."

చీకటి పడ్డాక ఇద్దరూ బయట టేక్సీలవైపు నడుస్తూంటే చైత్ర చెప్పింది.

"మనం ఓసారి హాస్పిటల్‌కి వెళ్ళి అట్నించి ఇంటికి వెళ్దాం."

"హాస్పిటల్‌కి దేనికి?" ఆద్య అడిగింది.

"నీ జనరల్ చెకప్‌కి. లేదా నీ పేర తీసుకున్న ఇన్సూరెన్స్ పనిచేయదు" అబద్ధం చెప్పింది.

చైత్ర చెల్లెలికోసం హాస్పిటల్‌కి ముందే మూడువందల ముప్పై సిడీలు చెల్లించింది. డాక్టర్‌తో ఆద్య గురించి వివరంగా ముందేఫోన్‌లో చెప్పింది.

"కొద్ది రోజుల క్రితం నా చెల్లెలు ఎమోషనల్ స్టేట్‌లో పొరపాటున.."

"ఐ అండర్‌స్టాండ్" ఆ ఘానా నల్ల డాక్టర్ చైత్ర చెప్పేది పూర్తిగా విని చెప్పాడు.

"మై టర్న్ మేడం, వేర్ కెన్ ఐ టేక్ యు టు?" వాళ్ళని చూసిన ఓ టేక్సీ డ్రైవర్ ఆహ్వానిస్తూ చెప్పాడు.

"వారా ప్లీజ్" చైత్ర చెప్పింది.

టేక్సీ చాలా పాతది. దాని తలుపుకి కట్టిన తాడుని తీసి వాళ్ళు ఎక్కాక మూసి మళ్ళీ తాడు ముడివేసాడు. ఇద్దరూ ఎక్కి కూచున్నాక చైత్ర చెప్పింది.

"టకరోడీలో టేక్సీలకి మీటర్లుండవు. బేరాలే. వీళ్ళ టేక్సీలన్నీ పాతకార్లు. ఇది బీద దేశం అని టేక్సీలు గుర్తుచేస్తాయి. కాని ఆఫ్రికాలోని కొన్ని దేశాలతో పోలిస్తే ఇది ధనిక దేశం. పేదవాళ్ళు కాబట్టి నేను కూరలవారితో, టేక్సీలవారితో బేరం ఆడను. ఓ డాలర్‌కి వీళ్ళ సిడిలు తొమ్మిది వస్తాయి. ఒకో సిడి మన ఏడున్నర రూపాయలకి సమానం. ఆఫ్రికా ఖండం మొత్తానికి టాప్ రిచ్ కంట్రీ నైజీరియా అని చెప్పాగా. తర్వాత ఈజిప్ట్, సౌత్ ఆఫ్రికా, అల్జీరియా, మొరాకోలు రిచెస్ట్ కంట్రీలు. అక్కడ ఇలా అదనంగా ఇవ్వను. మనింటికి స్థానికులకి పది సీడీలకే వస్తారు. ఎక్స్‌పేక్స్‌ని ఎక్కువ అడుగుతారు."

" ఎక్స్‌పేక్స్ అంటే?"

"ఎక్స్‌పేట్రియాట్స్. అంటే ప్రవాసులు, ప్రవాసుల అవసరాలకోసం ఇక్కడ అనేక షాప్స్, రెస్టారెంట్స్ వెలిసాయి. మనింటి దగ్గరే జర్మనీనించి వచ్చిన ఒకతను రెస్టారెంట్ తెరిచాడు. డేనిష్ రెస్టారెంట్ కూడా. 'బాంబే బ్రాసరీ' అని మన ఇండియన్ రెస్టారెంట్ కూడా ఒకటుంది."

హాస్పిటల్‌కి చేరుకుంటూండగా చెప్పింది.

"మనం వెళ్ళే హాస్పిటల్ ఎక్స్‌పేక్స్ కోసం నడుస్తోంది. వెస్ట్ ఆఫ్రికన్ రెస్క్యూ అసోసియేషన్ అనే సంస్థ నడిపే హాస్పిటల్ అది. షార్ట్ ఫాం డబ్ల్యు. ఏ.ఆర్.ఏ. వారా. ఇది ఎఫ్లియేటెడ్ విత్ ఇంటర్నేషనల్ ఎస్.ఓ.ఎస్."

డాక్టర్ ఆద్యని కొన్ని ప్రశ్నలు వేసి కొన్ని టెస్ట్‌లని రాసిచ్చాడు. బయట ఆగి ఉన్న టేక్సీల్లోని ఓదాని డ్రైవర్‌తో చైత్ర చెప్పింది.

"కాఫీ కార్నర్ రోడ్."

"ఎస్. మేమ్."

దారిలో చైత్రకి ఫోన్ వచ్చింది. ఆమె మాట్లాడాక ఆద్య చెప్పింది.

"నీ ఇంగ్లీష్ బాగా ఇంప్రూవైందక్కా. కెర్నింగ్ అంటే ఏమిటి?"

"కెర్నింగ్ అచ్చులోని రెండు అక్షరాలమధ్య గల ఖాళీ ప్రదేశం. రోజుకో కొత్తపదం నేర్చుకుంటాను. ఇవాళ ఎనమ్నీసిస్ అనే పదం నేర్చుకున్నాను. ఎనమ్నీసిస్ అంటే రీ కలెక్షన్, రెమినిసెన్స్, రిమంబరెన్స్ ఆఫ్ ది పాస్ట్. వాటిని తరచు ఉపయోగించడం ద్వారానే గుర్తుంచుకోగలం" చైత్ర చెప్పింది.

టేక్సీ ఐదు నిమిషాల్లో వాళ్ళ ఇంటి ముందు ఆగింది. దిగాక పది సిడీలు ఇచ్చి గేట్ బయట బెల్‌ని నొక్కింది. తలుపు తెరచిన గార్డ్ ఆహ్వానిస్తూ చెప్పాడు.

"వెల్‌కం బేక్ మేం."

"థాంక్ యు మిస్టర్ డేనియల్. దిసీజ్ మై సిస్టర్ ఆద్య."

"ఆదయ. స్వీట్ నేం. వెల్‌కం టు టకరోడి ఆద.."

"థాంక్ యు మిస్టర్ డేనియల్. ది నేం ఈజ్ ఆద్య" ఆద్య నవ్వుతూ చెప్పింది.

ఆమె టకరోడీకి వచ్చాక అదే సహజంగా వచ్చిన మొదటి నవ్వు. "గుడ్ నైట్ మేం."

"గుడ్ నైట్ డేనియల్" ఈసారి చైత్రతోపాటు ఆద్య కూడా బదులుగా విష్ చేసింది.

చైత్ర తమ ఇంటి తలుపు తెరుస్తూ చెప్పింది.

"షిఫ్ట్‌కి ఇద్దరు చొప్పున మన బిల్డింగ్‌కి సెక్యూరిటీ గార్డ్‌లు మూడు షిఫ్ట్‌లలో ఇరవై నాలుగు గంటలూ కాపలా ఉంటారు. ఆయిల్ కంపెనీలు తమ ఉద్యోగస్థుల సెక్యూరిటీకి, సంక్షేమానికి టాప్ ప్రయారిటీ ఇస్తాయి. ఏటా మాకు డ్రగ్ టెస్ట్ చేస్తారు. డ్రగ్‌ని ఉపయోగించామని తెలిస్తే ఉద్యోగం ఊడుతుంది. క్రితం నెల మా లండన్ ఉద్యోగస్థుల్లో ఒకరు తాగి కారు డ్రైవ్ చేసి ఏక్సిడెంట్ చేసాడు.ఇది తెలిసి అతన్ని ఉద్యోగంలోంచి తీసేసారు."

లోపలికి వచ్చాక చైత్ర అడిగింది.

"స్విమ్మింగ్ లెసన్స్‌కి నీకు మూడ్ ఉందా?"

"ఉంది."

తన స్విమ్మింగ్ డ్రస్‌ని ఆద్యకి ఇచ్చింది. అది తొడుక్కుని అద్దంలో చూసుకున్న ఆద్యకి తన లావు స్పష్టంగా తెలిసింది.

"ఇండియన్స్‌లో హెల్త్ అవేర్‌నెస్ చాలా తక్కువ. నా ఫ్రెండ్స్ ఫోటోలని ఫేస్‌బుక్‌లో చూసి ఆశ్చర్యపోతుంటాను.నెలనెలకీ వారు లావవడం ఆగడం లేదు. ఆరోగ్యంగా, చురుగ్గా ఉండటానికి ఎక్సర్‌సైజ్ మస్ట్. జాగింగ్, వాకింగ్, సైక్లింగ్ లాంటివి నీ ఫ్రెండ్సెవరైనా చేయడం నీకు తెలుసా?" చైత్ర అడిగింది.

"లేదు."

"సరైన బరువులో ఉండటానికి మొదటి చిట్కా ఫుడ్ కంట్రోల్. జమోటాలో ఫుడ్ ఆర్డర్ చేసేముందు ఆలోచించాలి. డీప్ ఫ్రైడ్ ఫుడ్‌ని విషంలా ఎవాయిడ్ చెయ్యాలి. మనం తినే ఆహారం కేలరీలని కౌంట్ చేసుకునే అభ్యాసం చెయ్యాలి. రెండో మంత్రా ఎక్సర్‌సైజ్. ఈరోజు నేనో ఐస్‌క్రీం తింటే, ఆ కేలరిని మర్నాడు బర్న్ చేసే ఎక్సర్‌సైజ్ తప్పక చేస్తాను. స్పెయిన్, జపాన్‌లలో, ఇంకా చాలా దేశాల్లోని అమ్మాయిలు ఎంత సన్నగా ఉంటారో. అమెరికాలో ఎంత లావుగా ఉంటారో. ఇండియాలో కూడా. హెల్దీ ఫుడ్ హేబిట్స్ డెవలప్ చేసుకో డాలీ. 'నా ఒళ్ళు, నా ఇష్టం' అన్న ఫ్రెండ్స్ నాకున్నారు. లావుని ఎవరూ గౌరవించరు. ముఖ్యంగా జపనీస్."

ఇద్దరూ స్విమ్మింగ్ సైక్లింగ్‌లాంటిది. ప్రాక్టీస్ చేస్తూపోతే ఒక్క క్షణంలో ఎలా సైకిల్ బేలన్స్ చేయడం వస్తుందో అలా ఈతకూడా ప్రాక్టిస్ చేస్తూంటే ఏదో క్షణంలో వస్తుంది. ఆ క్షణం పిల్లలకి త్వరగా, మన వయసువాళ్ళకి అలశ్యంగా వస్తుంది. పద. ప్రాక్టీస్ మొదలు పెడుదువుగాని."

"నీకు ఎంత కాలానికి వచ్చింది?" ఆద్య అడిగింది.

చైత్ర గాగుల్స్‌ని నీళ్ళల్లో తడిపి ఇచ్చి చెప్పింది.

"ఏడు నెలలకి. ఇవి పెట్టుకో. ఇందువల్ల నీళ్ళల్లో కళ్ళు తెరిచినా చక్కగా కనపడుతుంది. లేదా కళ్ళల్లోకి నీళ్ళుపోయి కొత్తల్లో చిరాగ్గా ఉంటుంది."

ఆద్య తల వెనక భాగంలో దాని స్ట్రేప్‌ని బిగించాక ఆద్య సీరియస్‌నెస్‌ని నటిస్తూ దానికి నమస్కరించి చెప్పింది.

"ఓ స్విమ్మింగ్ పూలా! నీ నీళ్ళల్లో నేను ఈత కొట్టడానికి అనుమతిని ఇవ్వు."

"అదేం ప్రార్ధన?" చైత్ర ఆశ్చర్యంగా అడిగింది.

"అమ్మ వినే ప్రవచనాల్లో ఇలాంటివే చెప్తూంటారు" ఆద్య నవ్వుతూ చెప్పింది.

"టు స్టార్ట్ విత్, స్విమ్మింగ్ పూల్‌లో ఇటువైపు మూడు అడుగుల లోతుండి, క్రమంగా అవతలికి వెళ్ళే కొద్దీ లోతు పెరుగుతుంది. అవతల పదడుగుల లోతుంటుంది. కాబట్టి నువ్వు ఐదున్నర అడుగుల లోతుని దాటి వెళ్ళకు. లేదా మునిగిపోవచ్చు. ఐదున్నర అడుగులకి ఇది గుర్తు" చైత్ర లోపలివైపు ఎర్ర రంగు గీతని చూపించి చెప్పింది.

ఆ గీత పక్కనే లోతు ఐదున్నర అడుగులు అని అంకెల్లో రాసుంది.

"ఒకవేళ పొరపాటున అటెళ్ళినా కంగారు పడకు. నీళ్ళల్లోంచి పైకి వచ్చే టెక్నిక్, చేతులతో ప్రొపెల్ చేస్తూ పైకి రావాలి. ముందు రెండు చేతులని తలపైకి నిలువుగా చాచి, ఇలా, తక్షణం నీ సైడ్స్‌కి తీసుకురా. ఎటెన్షన్‌లో నిలబడ్డప్పుడు చేతులు ఉంచినట్లుగా. ఈ చేతుల కదలిక నిన్ను కొన్ని అడుగులు పైకి తోస్తుంది ఉపరితలానికి వచ్చేదాకా దీన్ని రిపీట్ చెయ్యాలి."

అక్క చెప్పేది ఆద్య శ్రద్ధగా వింటోంది.

"స్విమ్మింగ్‌లోని మొదటి లెసన్ నీరంటే భయం పోవాలి. రెండో లెసెన్ గాలి పీల్చడం మీద కంట్రోల్ ఉండాలి. గట్టిగా ఊపిరి తీసుకుని నీళ్ళల్లో పూర్తిగా మునిగి, ఎంతసేపు లోపల ఉండగలిగితే అంతసేపు ఒన్, టు, త్రీలు లెక్కపెడుతూ ఉండు. దీనివల్ల భయంపోయి, గాలిని స్థంభించే ప్రాక్టీస్ జరుగుతుంది. ఈ ప్రాక్టీస్‌తో క్రమంగా ఆ కౌంట్ పెరుగుతుంది . ముందుగా గాలిని బాగా పీల్చుకుని, నీళ్ళల్లో పూర్తిగా మునిగి బయటకి వదిలాక లే. ప్రతీరోజు స్నానానికి ముందు మొదటగా దీన్ని డజను సార్లు ప్రాక్టీస్ చేస్తూండు. నోటితో కూడా గాలిని వదలొచ్చు. బుడగలు వచ్చేది అందుకే. గోల్డెన్ రూల్ నీళ్ళల్లో గాలిని పీల్చకూడదు. నీళ్ళు ముక్కులోకి వెళ్తాయి. మరో గోల్డెన్ రూల్, నీళ్ళని తాగకూడదు .ఇంకో ప్రాక్టీస్ సైడ్‌కున్న ఈ కడ్డీని స్విమ్మింగ్ పూల్ గోడని చూస్తూ పట్టుకుని నీళ్ళల్లో నిలబడు. తర్వాత కాళ్ళని సమతలంగా నీళ్ళమీదకి తెచ్చే ప్రాక్టీస్ చెయ్యి. అంటే నీళ్ళమీద సమాంతరంగా పడుకోగలగాలి. ఈ ప్రాక్టీస్ వల్ల కాళ్ళని పైకి ఎలా నీళ్ళమీద తేలాలో అర్ధమవుతుంది. ఇవాల్టికి ఇవి ప్రాక్టీస్ చెయ్యి. నువ్వు గాలి బాగా పీల్చుకుని, నీ ఊపిరి తిత్తులనిండా గాలుంటే, నీళ్ళల్లో తేలడం తేలిక కాబట్టి బాగా శ్వాస తీసుకుని ప్రాక్టీస్ చెయ్యి. తక్కువ లోతుగల నీళ్ళల్లోనే ఉండు."

చైత్ర ఈతకొడుతూ చెల్లెలు చేసేది చూసి, దగ్గరకి వెళ్ళి కాళ్ళని ముట్టుకుని ఎలా వాటిని కదపాలో చెప్పింది.

"మోకాళ్ళనించే పైకి, కిందకి నైంటీ డిగ్రీస్‌లో కాళ్ళని కదపాలి."

స్విమ్మింగ్ పూల్ బేక్‌గ్రౌండ్‌లో స్విమ్మింగ్ డ్రస్‌లోని ఆద్యని చైత్ర ఫోటో తీసింది. తర్వాత ఇద్దరూ సెల్ఫీ తీసుకున్నారు.

తర్వాత ఇద్దరూ డ్రస్ మార్చుకుని స్నానం చేసారు. ఆ శ్రమవల్ల ఆకలిగా ఉండటంతో మెడిటరేనియన్ ఫుడ్ పీటా బ్రెడ్, హమ్మస్‌ని తిన్నారు.

తినేప్పుడు చైత్ర మళ్ళీ మొబైల్లో కేండ్ లాఫ్టర్ వచ్చే గతంలో చూసిన ప్రోగ్రాంని చూడటం గమనించిన ఆద్య అడిగింది.

"అదేమిటి చూస్తున్నావు?"

"ఎవ్విరిబడీ లవ్స్ రేమండ్. అమెరికన్ టి.వి సీరియల్. హాస్యంగా బావుంటుంది. బివిచ్డ్ అనే ఇంకోటి కూడా చూస్తూంటాను. ఫ్రెండ్స్ చూసావా?"

"లేదు."

"చూడు. నీకు అమెరికన్ ఏక్సెంట్ అర్ధమవచ్చు. మన టి.వి సీరియల్స్‌లా కాక హాస్యం సున్నితంగా ఉంటుంది" చెప్పింది.

"ఇంకోసారి ఆ పుస్తకం చదివేప్పుడు నాకు బాగా ఉపయోగిస్తాయని నేను కొన్ని మార్జిన్‌లో రాసుకుంటాను. అండర్‌లైన్ లేదా హైలైట్ చేస్తాను. ఓసారి నేను పేరిస్ మెట్రోలో వెళ్తూ ఓ పుస్తకం చదువుతూ అందులో అండర్‌లైన్ చేసుకుంటున్నాను. అకస్మాత్తుగా పుస్తకం మీద రాయొద్దని ఓ తల్లి ఆరేళ్ళ పిల్లని కోప్పడటం విని తలెత్తి చూస్తే, ఆ పాప ఓ పుస్తకంలో డూడిలింగ్ చేస్తోంది. ఆ పిల్లకి ఏ పుస్తకం మీద రాయచ్చో, దేనిమీద రాయకూడదో, పబ్లిక్ లైబ్రరీ పుస్తకానికి, స్వంత పుస్తకానికి మధ్యగల తేడాని అర్ధం చేసుకునే శక్తిలేదు. నన్ను అనుకరించిందని గ్రహించాక, అప్పటినించి నేను పబ్లిక్ ప్లేసుల్లో పిల్లలు చూసేచోట పుస్తకాల్లో అండర్‌లైన్ చేయడం మానేసాను."

"ఓ!"

"పుస్తకాలని తెరచి చూస్తే ఏ వాక్యాలని అండర్‌లైన్ చేసారు, మార్జిన్‌లో ఏం రాసారన్న దానిమీద వారిని అసెస్ చేయచ్చు. కదా? గుడ్‌నైట్ డాలీ."

"గుడ్‌నైట్ అక్కా" ఆద్య చెప్పింది.

ఆ రాత్రి చైత్ర తన తల్లికి ఫోన్ చేసింది.

"ఎలా ఉంది అది?" ఆవిడ తక్షణం అడిగింది.

"బానే ఉంది. నువ్వు చెప్పినట్లు కొద్దిగా మతిమరుపు వచ్చింది."

"ఇంకా తగ్గలేదా?"

"లేదు. బట్టలకోసం కింద గదిలో కబోర్డ్‌లన్నీ వెదకడం చూసాను. ఏం వెదుకుతున్నావంటే చెప్పింది. దాని గది పై గదంటే అది మర్చిపోయానని చెప్పింది."

"అమ్మయ్యో! తాత్కాలికమన్నారే ఇక్కడ. డాక్టర్‌కి చూపించావా? ప్రవర్ధన వెంటనే అడిగింది.

"చూపించాను. రిజల్ట్స్ రేపు వస్తాయి. నాన్న ఎలా ఉన్నారు?"

"మొగబుద్ధి. బయటకి చెప్పరు కాని ఆయన బాగా కృంగిపోయారు."

"కృంగడం కాదు పిచ్చమ్మా. అది ప్రేమ. నువ్వు ఇంత హడావిడిలోనూ ఆద్యతో పంపిన పోపు సామాను ఉపయోగిస్తోంది రేపు వంకాయ కూర" చైత్ర నవ్వుతూ చెప్పింది.

"నీకు ఇష్టమని గార్లిక్ పాపడ్ కూడా పంపాను."

"అవును. నాలుగు పేకెట్లు."

తాము బీచ్‌కి వెళ్ళడం మొదలైనవి పూసగుచ్చినట్లు చెప్పింది.

"అది బానే ఉంది. నువ్వేం కంగారుపడకు. నాన్నతో కూడా చెప్పు."

ఇద్దరూ మరికాసేపు మాట్లాడుకున్నాక చెప్పింది.

"ఇక పడుకుంటానమ్మా."

"బై" ప్రవర్ధన చెప్పింది.

మరో పది నిమిషాలు మాట్లాడాక లైన్ కట్ చేసింది.

ఆ రాత్రి ఆద్యకి టీపాయ్ మీద కలరింగ్ బుక్‌తోపాటు ఓ కథల పుస్తకం కూడా కనిపించింది. దాన్ని అందుకుని తిరగేస్తూంటే ఓ కథ పేరు ఆమెని ఆకర్షించింది. 'నువ్వు దేన్నీ కోల్పోవు'దాన్ని ఆసక్తిగా చదివింది.

ఓ రోజు భర్తభోజనం దగ్గర తన భార్యతో చెప్పాడు.

"అన్నట్లు మన మామిడి చెట్టుని కొట్టించేద్దామని అనుకుంటున్నాను."

"అయ్యో! ఎందుకని?" అతని భార్య అడిగింది.

"ఈసారి తుఫానులో అది కూలిపోతే సరిగ్గా మన పడక గదిమీద పడుతుంది."

భోజనాలు అయ్యాక ఆవిడ వంటగదిలోని సింక్ దగ్గర గిన్నెలు పెడుతూ, కిటికీలోంచి కనపడే మామిడి చెట్టువంక చూసింది. అది కొద్దిరోజుల తర్వాత ఉండదని అనుకున్నాక బాధ కలిగింది. దానిమీద ఉడతలని, పిట్టలని చూసి ఆ చెట్టుపోయాక వాటికి ఆశ్రయం పోతుందని అనుకుంది. 'అది తన జీవితంలో ఓ భాగమైపోయింది. అది లేకపోతే ఆ వెలితి తన జీవితంలో అలాగే ఉండిపోతుంది' అనుకుంది.

ఆదివారం కూలీలు గొడ్డళ్ళతో వచ్చి ఒకో కొమ్మని నరకసాగారు. నాలుగు గంటల్లో కొమ్మలన్నీ పోయి బోడి కాండం మాత్రం మిగిలింది. మరో గంట తర్వాత అది కూడా మాయమైంది.

'ఆ చెట్టులేక ఆ ప్రదేశమంతా ఎంత బోసిగా ఉందో కదండి?" ఆ రాత్రి ఆమె భర్తతో బాధగా చెప్పింది.

"త్వరలోనే దానికి నువ్వు అలవాటు పడిపోతావు. మనం పోగొట్టుకున్నదాన్ని పట్టుకోకుండా వదిలిపెట్టి, బదులుగా దొరికింది వదలకుండా పట్టుకుంటే చాలు" ఆయన ఓదారుస్తూ చెప్పాడు.

మర్నాడు ఆమె వంట చేస్తూ మళ్ళీ కిటికీలోంచి బయటకి చూసింది. అంతకు మునుపు ఆవిడ చూడని కొత్తవి కనిపించాయి. వంటగదిలోకి వెలుగు ధారాళంగా రావడంతో ఆ చెట్టు ఉన్నప్పటిలా పగలు కూడా లైట్  వేసుకోనక్కర్లేదని గ్రహించింది. ఆ సహజ వెలుగువల్ల మనసుకి ఆహ్లాదంగా అనిపించింది. ఆ చెట్టు లేకపోవడంవల్ల రోడ్కి అవతల స్కూల్ కాంపౌండ్‌లో ఆడుకునే పిల్లలు కూడా కనిపించారు. ఇదివరకు నీడ పడుతూండటంతో మొక్కలు పెరగని వృధాగా వదిలేసిన చోటులో ఆమె భర్త పచ్చి మిరపకాయలు, టొమేటో మొక్కలని పండించాడు. త్వరలోనే అవి కాసాయి.

'మామిడి చెట్టు లేకపోతేనే బావుంది' అని ఆమె కొద్దిరోజుల్లో అనుకుంది. మామిడి చెట్టు లేని వెలితి ఇప్పుడు ఆమెలో లేదు.

ఆ కథ చదివాక ఆద్య తర్వాతి కథ చదవలేదు. పుస్తకం మూసి  కళ్ళు మూసుకుంది. ఆమెలో గత రాత్రిలా కాక ప్రతికూల ఆలోచనలు తగ్గాయి.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**
www.anandbooks.com
www.telugubooks.in

Post your comments